క్లుప్తంగా

నేటి నుంచి పుస్తక ప్రదర్శన

దర్శి (కురిచేడు): అంతర్జాతీయ పుస్తక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా స్థానిక పుట్ట బజారులోని శ్రీ ప్రశాంత స్కూల్ స్టెప్ ఆడిటోరియంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు ప్రశాంత స్కూల్ కరస్పాండెంట్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం నుంచి నాలుగు రోజులపాటు జరిగే పుస్తక ప్రదర్శన సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. పుస్తక ప్రదర్శనలో ఎగ్జిబిషన్ కూడా ఉంటుందని చెప్పారు. రోజూ సాయంత్రం విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కారు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

తర్లుపాడు: మండలంలోని సీతానాగులవరం సమీపంలో తర్లుపాడు నుంచి మార్కాపురం వెళ్లే ప్రధాన రహదారిపై కారు బోల్తా కొట్టి పొలాల్లోకి దూసుకెళ్లిన సంఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. ఓ వ్యక్తి వేగంగా కారు నడుపుతూ అదుపు చేయలేక ప్రమాదం జరిగినట్లు స్థానికులు పేర్కొన్నారు. సదరు వ్యక్తికి గాయాలు కావడంతో కారును అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

కొమరోలు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని తాటిచెర్లమోటు జంక్షన్‌లో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. గిద్దలూరుకు చెందిన బాషా అనే వ్యక్తి రోజులాగే గ్రామాలు తిరిగి ఐస్‌లు అమ్ముకుని సైకిల్‌పై వెళ్తుండగా బేస్తవారిపేట వైపు నుంచి గిద్దలూరు వెళ్తున్న లారీ సైకిల్‌ను ఢీకొనడంతో బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ప్రైవేటు వాహనంలో గిద్దలూరు వైద్యశాలకు తరలించారు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

కొమరోలు: లారీ బోల్తాపడడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని అయ్యవారిపల్లె, ఇడమకల్లు గ్రామాల మధ్యలో శుక్రవారం చోటు చేసుకుంది. పైపుల లోడుతో వెళ్తున్న లారీ పశ్చిమ బెంగాల్ నుంచి కడపకు వెళ్తుండగా లారీ క్యాబిన్ వెనుక భాగం లింకు ఊడిపోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు డ్రైవర్ తెలిపాడు. లారీడ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

భూఆక్రమణపై పోలీసులకు ఫిర్యాదు

కొనకనమిట్ల: మండలంలోని చినారికట్ల గ్రామానికి చెందిన ఉడుముల జగన్‌మోహన్ రెడ్డికి చెందిన భూమిని ప్రభుత్వ పెద్దల సహకారంతో ఆక్రమించి భూమిలో ఉన్న చెట్లను, పూరి గుడిసెను తొలగించిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జగన్‌మోహన్‌రెడ్డి తల్లి ఉడుముల ఆదిలక్ష్మమ్మకు చెందిన భూమి సర్వే నంబరు 78/2లో 8 ఎకరాల విస్తీర్ణం ఉంది. జగన్‌మోహన్‌రెడ్డి వాటాకు సంబంధించి కొంత భూమి వచ్చింది. ఆ భూమిని సర్వే చేయించి చుట్టూ ఫెన్సింగ్ వేసి కొంత భూమిలో పొగాకు సాగు చేశాడు. దాంట్లోనే పూరి గుడిసె వేశాడు. 50 సెంట్ల భూమిని హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంకు ఏర్పాటకు లీజుకు ఇచ్చాడు. ఇటీవల ఆయన పనిపై హైదరాబాద్ వెళ్లాడు. ఆయన లేని సమయంలో లాయర్ లక్ష్మీరెడ్డి ప్రోద్బలంతో ఉడుముల దశరథరామిరెడ్డి, శంకరరెడ్డితో పాటు యోగి, జేసీబీ డ్రైవర్ అప్పలనాయుడు కలిసి భూమిలో ఉన్న వేపచెట్లు, పూరి గుడిసెను తొలగించారు. దీంతో రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లింది. జగన్‌మోహన్‌రెడ్డి కొనకనమిట్ల పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. పోలీస్‌లు సంఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. పోలీసులు వెళ్లిన తర్వాత మళ్లీ దౌర్జన్యంగా ఆయన భూమిలోకి వెళ్లారు. ప్రభుత్వ పెద్దల సహకరాంతో ఇంతటి దౌర్జాన్యానికి పాల్పడుతున్న దశరథరామిరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జగన్‌మోహన్‌రెడ్డి పోలీసులను కోరుతున్నాడు.

చెరువు మట్టి..చలో ఇటుక బట్టీ!


మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్

దొనకొండ: మండలంలోని రుద్రసముద్రం చెరువు నుంచి మట్టిని దర్శి ఇటుక బట్టీలకు అక్రమంగా యథేచ్ఛగా తరలిస్తున్నారు. గతంలో అనుమతులు పొంది చెరువు మట్టిని రవాణా చేసేవారు. నేడు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అనుమతులు తుంగలో తొక్కి సెలవు రోజుల్లో అక్రమంగా రవాణాకు పాల్పడుతున్నారు. గతంలో రాత్రి వేళల్లో మట్టిని తరలించి పగటి పూట నిలిపేసేవారు. నేడు అలాంటి పరిస్థితి లేదు. తమకేం..అంటూ పదుల సంఖ్యలో టిప్పర్లతో రాత్రింబవళ్లు ఇటుక బట్టి యజమానులు మట్టిని తోలి సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను సంప్రదించి ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చలానా కట్టి అనుమతులు పొంది మట్టిని ఇటుక బట్టీలకు తోలుకునేవారు. నేడు తమకు ఎదురొచ్చేది ఎవరు చూద్దామంటూ అనుమతులు లేకుండా విచ్చలవిడిగా మట్టి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దొనకొండ మట్టి దర్శి ఇటుకల బట్టీలకు తరలించడం పరిపాటిగా మారిందని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మట్టి అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని రుద్రసముద్రం గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ బి.రమాదేవిని, ఇరిగేషన్ ఏఈ కోటేశ్వరరావును వివరణ కోరగా వారు పొంతన లేని సమాధానం చెప్పి తాము ఏం చేయమంటావని మాట దాటేస్తున్నారు. అధికారులే మాట దాటేస్తే ప్రభుత్వ సొమ్ముకు కాపలా ఎవరు అనే ప్రశ్నకు సమాధానం లేదు.

తాగునీరు వృథా..ఆపేదెలా?


పైపు లీకై వృథా అవుతున్న నీరు

దర్శి (కురిచేడు): ఎండలు మండుతున్నాయి. గొంతు తడుపుకునేందుకు గుక్కెడు నీటి కోసం అలమటిస్తున్న రోజులు. ప్రతి చుక్క ఎంతో విలువైంది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యానికి తాగునీరు వృథా అవుతోంది. స్థానిక కురిచేడు రోడ్డులోని కీర్తి మెడికల్ ఎదురుగా పైపులైన్‌కు లీకు ఏర్పడి తాగునీరు వృథా అవుతున్నా పట్టించుకున్న వారు కరువయ్యారు. అంతేగాకుండా నీటి వృథాతో నీరు సరఫరా సమయంలో అక్కడ నిలిచిన నీరు తిరిగి లీకు నుంచి పైపుల్లోకి చేరుతుంది. తిరిగి నీటి సరఫరా చేసిన సమయంలో ఆ కలుషిత నీరు స్వచ్ఛమైన నీటితో కలిసి కుళాయిల ద్వారా ప్రజలకు చేరుతుంది. దీంతో అంటురోగాలు ప్రబలే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిర్లక్ష్యం వీడి నీటి పైపునకు ఏర్పడిన లీకులకు మరమ్మతులు చేసి కలుషిత నీటి సరఫరాతో పాటు నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.


కురిచేడు: ప్రార్థనకు హాజరైన క్రైస్తవులు


పెద్దదోర్నాల: ప్రత్యేక ప్రార్థనకు హాజరైన క్రైస్తవులు

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే


త్రిపురాంతకం: రాజుపాలెం చర్చిలో..


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న దేవప్రసాద్

కురిచేడు: శిలువపై ఏసుక్రీస్తు మరణానికి గుర్తుగా క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేగా శుక్రవారం నిర్వహించుకుంటారని పాస్టర్ ఖాశీం తెలిపారు. మండలంలోని చర్చిల్లో క్రైస్తవులు శుక్రవారం గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు చేశారు. ఉదయం నుంచి క్రీస్తు మృతి చెందిన సమయంల్లో మూడు గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రాణత్యాగానికి గుర్తుగా క్రైస్తవులు 41 రోజులు ప్రత్యేక ఉపవాసాలు ఉండి తమ దీక్షను విరమించుకున్నారు. మండలంలోని తెలుగు బాప్టిస్టు చర్చిలో సంఘకాపరి శ్రీనివాసరావు, రోమన్ క్యాథలిక్ చర్చిలో ఫాదర్ రెవ రాయప్ప, లూథరన్ చర్చిలో ప్రత్యేక గుడ్‌ఫ్రైడే సందేశం అందించారు. పొట్లపాడులోని సీయోను ప్రార్థన మందిరంలో రెవరెండ్ ఖాశీం సందేశమిచ్చారు.

పెద్దదోర్నాల: మండల పరిధిలోని పలు గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే వేడుకలు క్రైస్తవులు శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో భక్తులు భారీగా ప్రార్థనలు చేసుకునేందుకు చర్చిలకు తరలి రావటంతో భక్తులతో కిక్కిరిశాయి. క్రీస్తు లోకంలో పాపుల రక్షణార్థమై శిలువ మరణం పొందినట్లు క్రైస్తవుల విశ్వాసం. దీంతో తెల్లవారు జాము నుంచి ఉపవాస దీక్షలు ఆచరించి మధ్యాహ్నం 3 గంటలకు చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించుకున్నారు. స్థానిక టౌన్ బాప్టిస్ట్ చర్చిల్లో జరిగిన పూజల్లో పాస్టర్ ముండ్లా ప్రభాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పాస్టర్ మాట్లాడుతూ శిలువపై పలికిన ఏడు మాటలను భక్తులకు బోధించారు. మొదట శత్రువులను క్షమించుట, రెండో మాటగా క్రీస్తు ఎవరికి రుణస్తుడు కాడు, మూడో మాటగా శిలువలో కూడా తన బాధ్యతను మరవకుండా, నాలుగో మాటగా తండ్రి అయిన దేవుడు లోకంలోని పాపులను చూడలేక తలను పక్కకు తిప్పుట, ఐదోమాటగా పాపి రక్షణ దాహం ఆయన తీర్చుట, ఆరో మాటగా బలులు, ధర్మశాస్త్రం ప్రవక్తలు, క్రీస్తు చూపిన ప్రవచనలను సమస్తం పలుకుట. క్రీస్తు స్వేచ్ఛగా ప్రాణం విడిచెను అనే వాటిపై ప్రత్యేక బోధించారు. ఈ సందర్భంగా చర్చిలో పాల్గొన్న భక్తులకు పాస్టర్ ప్రత్యేకంగా దీవెనలు అందించారు. మండల కేంద్రంలోని జీసస్ హీలింగ్ టెంపుల్, ఇవాంజిలికల్, లూథరన్, బాప్టిస్టు, క్రీస్తు పిలుస్తున్నాడు చర్చిల్లో ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

తాళ్లూరు: ఏసుక్రీస్తు లోకరక్షకుడని, పాపులను రక్షించేందుకు ఆయన ఈ లోకానికి వచ్చారని పాస్టర్ సామ్యేల్ లాన్స్ లాట్ అన్నారు. గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని నాగంబొట్లపాలెం అపోస్టికల్ ఫుల్ గాస్పెల్ చర్చిలో, తూర్పుగంగవరం, బొద్దికూరపాడు, శివరాంపురం లక్కవరం గ్రామాల్లో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. గుడ్ ఫ్రైడే వేడుకలు తెల్లవారు జాము నుంచే ప్రారంభమయ్యాయి. పాస్టర్ సామ్యేల్ లాన్స్ లాట్ దైవ సందేశం అందించారు. దేవుడు లోకానికి వెలుగై వచ్చారని, చీకటిలో ఉన్న మానవుడిని వెలిగించేందుకు త్యాగానికి సిద్ధపడ్డారని చెప్పారు. జీవితంలో నూతనోత్తేజాన్ని కలిగించిన దేవుడు సమస్త ఆనందాలు పంచారని తెలిపారు.

త్రిపురాంతకం: మండల పరిధిలో గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు బాపిస్ట్ చర్చి, ఆర్‌సీఎం చర్చి, క్యాథలిక్ చర్చి, లూథరన్ చర్చి, హెబ్రోను చర్చితో పాటు తదితర చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పాస్టర్స్ ప్రత్యేకంగా బైబిల్ సందేశం అందించారు. ఉదయం నుంచి క్రైస్తవులు పండగ వాతావరణంతో గుడ్ ఫ్రైడేను ఘనంగా జరుపుకున్నారు.

దర్శి (కురిచేడు): ఏసుక్రీస్తు శిలువ వేసిన రోజును జ్ఞాపకం చేసుకొని గుడ్‌ఫ్రైడే ఆరాధన శుక్రవారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక సీయోను ప్రార్థన మందిరం, దర్శి రీజియన్ పాస్టర్స్ ఫెల్లోషిప్ ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే ఆరాదన ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఏసుప్రభువు లోకానికి చేసిన త్యాగం, ఆయన ప్రేమను మరువలేమని దైవసేవకులు గొంగటి జాన్ బోధించారు. దర్శి రీజియన్ పాస్టర్స్ ఫెల్లోషిప్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో, సాయిబాబా ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జి.దేవప్రసాద్, దర్శి రీజియన్ పాస్టర్స్ ఫెల్లోషిప్ ప్రెసిడెంట్ జి.ఏసుదాసు, అపోస్తులు జీఎస్ పాల్, దర్శి మండల ప్రెసిడెంట్ బి.అనిల్, వైస్ ప్రెసిడెంట్ జక్రయ్య, ట్రెజరర్ నిరీక్షణకుమార్, టి.రూబెన్, కె.డానియేల్ పాల్, జి.వెంకట్రావు, టి.వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

దొనకొండ: మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవులు శుభ శుక్రవారం సందర్భంగా ఉపవాసాలతో ప్రార్థనలు జరుపుకున్నారు. ఉదయం నుంచి పిల్లలు, పెద్దలు భక్తిశ్రద్ధలతో చర్చిల్లో ప్రార్థనలు చేశారు. దొనకొండలో ఏబీఎం, ఆర్‌సీఎం, బెరాకా, కల్వరి, సీఎస్ఐ, లూథరన్ చర్చిల్లో దైవ సేవకులు దైవసందేశం అందించారు. ఆర్‌సీఎం చర్చ్ ఫాదర్ థామస్, ఏబీఎం చర్చి పాస్టర్ డి.ప్రభుదాస్ గుడ్ ఫ్రైడే ప్రాముఖ్యతను వివరించారు.


దొనకొండ: దైవ సందేశం అందిస్తున్న పాస్టర్ ప్రభుదాసు


తాళ్లూరు: ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న భక్తులు

తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్


దొంగలుగా అనుమానం వ్యక్తం చేస్తుంది వీరినే..

తాళ్లూరు: మండలంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారని, తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తున్నారని, తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని ఎస్సై ఎస్.మల్లికార్జునరావు శుక్రవారం సూచించారు. ఒక జంట ఈ ప్రాంతంలో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ఆయన అనుమానం వ్యక్తం చేశారు. తొలుత మహిళ ప్రతి ఇంటికి వెళ్లి అనాథాశ్రమానికి సాయం చేయమని కోరుతుంది. అలా వెళ్లి తాళం వేసి ఉన్న ఇళ్లను గమనిస్తుంది. ఆ తర్వాత తన పక్కన ఉండే మగ మనిషికి సమాచారం ఇస్తుంది. ఇలా వీళ్లు దొంగతనాలకు పాల్పడుతున్నారని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మల్లికార్జునరావు సూచించారు.

వేడుకగా సీతారామ కల్యాణం


అలంకరణలో సీతారాములు

కొనకనమిట్ల: అంతా రామమయం..జగమంతా రామమయం.. అంటూ సీతారాముల కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని గరిమినపెంటలో పట్టాభిరామస్వామి ఆలయంలో శుక్రవారం సీతారాముల కల్యాణాన్ని భక్తుల కోలాహలం నడుమ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణ ఉభయ దాతలుగా పలువురు దంపతులు వ్యవహరించారు. స్వామి వారికి వేదపండితుడు నారాయణశర్మ అర్చనలు, అభిషేకాలు నిర్వహించి కల్యాణ ఘట్టాన్ని జరిపించారు. కల్యాణం అనంతరం రైతులు తమ ఎడ్లను పూజించి స్వామివారికి పానకం, వడపప్పు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం సీతారాముల పట్టాభిషేకం ఉత్సవం, వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు.

అసాంఘిక కార్యకలాపాలకు చెక్


పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

పెద్దారవీడు: అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టేలా పనిచేయాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక పోలీసుస్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్ స్టేషన్‌లో స్థితిగతులు, పోలీసుల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలీసులతో కొంత సేపు సమావేశమయ్యారు. నేర, శాంతి భద్రతలపై స్థానిక పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాటిని నియంత్రించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో ఆరాతీసి నేరాల కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. పోలీసులు విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ మండలం పరిధిలో జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణ, మహిళ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఆయనతో పాటు మార్కాపురం డీఎస్పీ నాగరాజు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఎర్రగొండపాలెం సీఐ కోటయ్య, ఎస్ఐ అనిల్‌కుమార్, పోలీసులు ఉన్నారు.

వినియోగదారుల సేవలో భారతి సిమెంట్


టీ షర్టులు, టోపీలు అందజేస్తున్న భారతి సిమెంట్ ప్రతినిధులు

దర్శి (కురిచేడు): మండుటెండలో కష్టపడుతున్న భవన నిర్మాణ కార్మికులపై భారతి సిమెంట్ దర్శి పట్టణ పరిధిలో పలుచోట్ల పనిచేస్తున్న తాపీ మేస్త్రీలకు టీ షర్టులు, టోపీలు శుక్రవారం అందజేసింది. ఈ సందర్భంగా భారతి సిమెంట్ కంపెనీ టెక్నికల్ మేనేజర్ ఛాయాపతి తాపీ మేస్త్రీలతో మాట్లాడుతూ రోబోటిక్ టెక్నాలజీతో, ట్యాంపర్ ప్రూఫ్ ప్యాకింగ్ అండ్ జర్మన్ టెక్నాలజీతో సిమెంట్ తయారు చేస్తున్నట్లు తెలిపారు. శ్లాబుల నిర్మాణానికి తమ సిమెంట్ అన్ని విధాలా అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. టెక్నికల్ సర్వీసెస్, వాటర్ టెస్టులు స్లాబ్ అనంతరం కాంక్రీట్ టెస్ట్‌లు చేయటం భారతీ సిమెంట్ కంపెనీ ముఖ్య ఉద్దేశమన్నారు. భవన నిర్మాణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. వేసవిలో తాపీ మేస్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెళకువలు ఆయన వివరించారు. సేల్స్ సీనియర్ టెక్నికల్ ఇంజినీర్లు శ్రీకాంత్‌రెడ్డి, భవానీ శంకర్, శివారెడ్డి, నాగేంద్ర, ఉదయకిరణ్, సాయిప్రకాష్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన


దర్శి: మంటలు ఎలా ఆర్పాలో డెమో ఇస్తున్న సిబ్బంది


పెద్దదోర్నాల: అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

పెద్దదోర్నాల: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక సిబ్బంది శుక్రవారం మండల కేంద్రంలో అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మండల కేంద్రంలోని భారత్ గ్యాస్, హిందుస్తాన్ పెట్రోల్ బంక్ తదితర ప్రాంతాల్లో ప్రమాదాలపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్టేషన్ ఫైర్ అఫీసర్ హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

దర్శి (కురిచేడు): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక గ్యాస్ గోడౌన్, పెట్రోలు బంకుల్లో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించినట్లు అగ్నిమాపక కేంద్ర అధికారి సీహెచ్ జాలయ్య తెలిపారు.

గ్యాస్ లీకై మంటలు వ్యాపించినప్పుడు ప్రమాదాన్ని నివారించటం గురించి డెమో ద్వారా వివరించామన్నారు. పెట్రోలు బంకుల్లో సిగిరెట్లు తాగటం, సెల్‌ఫోన్లో మాట్లాడితే అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయని తెలిపారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు.

ఎస్పీ దామోదర్ ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజలు చేస్తున్న ఎస్పీ దామోదర్, పక్కన డీఎస్పీ నాగరాజు

మార్కాపురం టౌన్: శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ లక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎస్పీ ఏఆర్ దామోదర్ చెన్నకేశవస్వామి దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ గొలమారి శ్రీనివాసరెడ్డి, అర్చకులు ఎస్పీకి ఘన స్వాగతం పలికారు. బ్రహ్మోత్సవాల విశిష్టతను, వాహన సేవల వివరాలను, ఆలయ చరిత్రను అర్చకులు తెలిపారు. ఆయన వెంట డీఎస్పీ డాక్టర్ నాగరాజు, ఎస్‌బీ సీఐ రాఘవేంద్ర, సీఐ సుబ్బారావు, పలువురు ఎస్సైలు ఉన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఎస్పీ సూచించారు. ఎస్పీకి స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం అందించి ఆశీర్వచనం చేశారు.